# కలలో వార్తలు

కలలు నిజం కావని నాకు తెలుసు. నా కలలు బొత్తిగా అబద్ధాలు. ఒక కలలో నాకు దారి పొడుగునా చిల్లర డబ్బులు దొరికినై. ఏమయింది? ఏమీ కాలేదు.

కాని రాతగాణ్ణయిన పాపాన కలలు కనటం నాకు వ్యసనమైపోయింది. దానిక తగ్గట్టుగానే నాకు నా కలం మీద ఏమాత్రమూ ఆధికారం లేదేమో, వాటిని గురించి రాయక తప్పటమూ లేదు.

అందుచేత... ఇదిగో నా కల. ఇదంతా నిజమవుతుందని ఎవరన్నా నమ్మితే వాళ్ల పాపాన వాళ్లే పోతారు.

* * * * *

రైల్లో కాబోలు పోతున్నాను. అది రైలల్లే లేదు. కాని వేగంగా పోతున్నది. పట్టాలు లేవు, టకటక శబ్దం లేదు. నా పక్కనే ఒకాయన పత్రిక చదువుతున్నాడు.

"నిర్దుష్టమైన బడ్జెటు" అని చదివాడు.

"కాస్త పైకి చదవండి బాబూ" అన్నాను.

"నేడు డొమినియను ఎసెంబ్లీలో గ్రీ(ట్రావరప్పగారు నిర్దుష్టమైన బడ్జెటు అదివరకెన్నడూ పుట్టి ఉండలేదని వైద్యులు చెప్పుకొనుచున్నారు. ఇది మంత్రసానుల శక్తులను శోధించగల బడ్జెటు కాన్పు. బడ్జెటు వివరాలు. బడ్జెటు బొడ్డు కోసినాక తొమ్మిదిన్నర పౌనుల బరువుతున్నది. ప్రసవ వేదన సరిగా నాలుగు గంటల పన్నెండు సెకండ్లు మాత్రమే... పెట్టుబడి మీద ఇదివరలో ఉండిన పన్నులన్నీ ఈ బడ్జెటుతో తొలగించబడ్డాయి. దీనిమూలంగా పారిశ్రామికులు తమ లాభాలన్నిటినీ తిరిగి పెట్టుబడి చేయటానికే వినియోగపరుచుకో గలుగుతారు. ప్రభుత్వ ఖర్చుకు కావలసిన మొత్తం 15 వేల కోట్లున్నా ఈ కింది పన్నుల ద్వారా వసూలు చెయ్యబడుతుంది.

1. పెట్టుబడిలేని ఆదాయం మీద నూటికి యాభై పన్ను.
2. ముష్టి ఎత్తుకొనే పేద ప్రజల మీద నూటికి పది వంతులు పన్ను.

3. సినిమా, నాటకం, పత్రిక ప్రణయ లేఖ, మీటింగులు, పరిషత్తు సమ్మేలు మొదలైన వినోదాల మీద నూటికి 80 వంతున పన్ను.

4. ఎన్నికలలో మెజారిటీ తెచ్చుకోలేని పార్టీల సభ్యుల మీద మనిషికి నూరు రూపాయల చొప్పున పన్ను. (ఇది మద్రాసు కాంగ్రెసు పార్లమెంటరీ పార్టీ ఎన్నికలకు కూడా వర్తిస్తుంది.) ఎన్నికయిన ఇరవై నాలుగు గంటలలోగా కోటు మార్చేవారిక పన్ను ముజరా ఇవ్వబడుతుంది.

5. ఎన్నికలలో పోటీ చేసి ఓడిపోయినవారు డిపాజిట్టు పోగొట్టుకోని పక్షంలో ఆ డిపాజిట్టు పన్ను కింద వసూలు చేయబడుతుంది.

ఇంతవరకు చదివి ఆ పెద్దమనిషి నాతో, "ఈ ప్రజాపత్రికలు రాయటానికేం? నిజం ఆలోచిస్తే ఇది నిర్దుష్టమైన బడ్జటు కానే కాదు" అన్నాడు.

"ఎందుచేతా?" అన్నాను.

"ఇది కాపిటలిస్టు మీద ఇన్డిరెక్టు టాక్సేషన్. ఉద్యోగాలు చేసుకునే వాళ్లూ అడుక్కుతినే వాళ్లూ కట్టే పన్ను పెట్టుబడిదార్ల మీదే కద పేడది. ఘోరం! ఘోరం!"

"అయితేనేం? పన్ను భారం జాస్తి అయినప్పుడు పారిశ్రామికులు తమ కింద పనిచేసే వారంతా బిచ్చగాళ్లేనని చెప్పి తప్పించుకోవచ్చు. బిచ్చగాళ్ల పన్ను చాలా తక్కువ కద" అన్నాను.

ఆయన విశాలంగా నవ్వి, "ఆ ఆలోచన నాకూ తట్టింది" అన్నాడు. మళ్లీ పత్రిక చదవసాగాడు.

"బడ్జెటు మీద మాట్లాడుతూ గ్రీట్రావరప్పగారు ఈ కింది విషయాలు చర్చించారు. ఈ ప్రభుత్వం యొక్క ఆశయం ఉత్పత్తి పెంచటం – పంచటం కాదు. సభ్యులు పరధ్యానంగా ఆలకించే దురభ్యాసం మానాలి. మన ఉత్పత్తి మన అవసరాలకు పదింతలూ, మన ప్రజల కొనుగోలు శక్తికి నూరింతలూ ఆయేవరకూ మనకు ప్రపంచ దేశాల మధ్య తలవంపులే. మన దేశంలో నూటికి 90 మంది అయినా అవసరాలకు మాడి చావకపోతే మనం నలుగురిలోనూ తల ఎట్లా ఎత్తుకు తిరుగుతామో నాకు తెలియటం లేదు. ఈ బడ్జెట్టును మీరు ఆమోదించినట్టయితే అప్పుడు మన తడాఖా చూపిస్తాను. ఈ బడ్జెటు ఎందుకు ఈ విధంగా ఉన్నది. ఉన్న పాళంగా పాసు చెయ్యాలో మీకు సంగ్రహంగా మనవి చేస్తాను... దేశంలో ఇన్ని ఏళ్లు గడిచినా ఇంకా మత వైషమ్యాలు తగ్గటం లేదు. మత సామరస్యం కోసం పాటుపడే వాళ్లందర్నీ జైళ్లలో తోశాము కాని కార్యం లేకుండా ఉంది. దేశంలో ఉన్న అల్ప సంఖ్యాక మతాల వారిలో కూడా, మత కలహాలకు బలి అయినవారు మిగతా వారిని పై దేశాలకు రవాణా చేశాము. దేశంలో ఏకమత ప్రతిష్ఠాపన

చేశాము. అట్లాగూ మత సామరస్యం నెలకొల్పటానికి సాధ్యం కాకుండా ఉంది. మత విముఖులూ, మతాన్ని తృణీకరించేవారూ ఇంకా దేశంలో ఉండి మతాభిమానులకు కోపం తెప్పిస్తున్నారని చెప్పటానికి నాకు చాలా తలవంపులుగా ఉన్నది. ఈ విషయమై తీవ్రచర్య తీసుకోవలసి ఉంది. మతావేశం లేనివారందర్నీ పట్టుకోవటానికి ఒక ప్రత్యేక పోలీసు శాఖ వేస్తున్నాము. దానికి 500 కోట్లు మాత్రమే ఖర్చు చేస్తున్నాం. నిజంగా ఈ మొత్తం చాలదు. కాని దీనితోనే పని గడిచేటందుకు గాను మతోన్మాదం లేని వారినందరినీ ఉరి తీసెయ్యటానికి ఏర్పాట్లు చేస్తున్నాం. చట్టం అంత దారుణంగా పెట్టినట్టయితే పోలీసు శాఖకు కొంతపని తగ్గిపోవచ్చును... రష్యా మీదా, తదితర ఫాసిస్టు దేశాల మీదా యుద్ధం చెయ్యటానికి సిద్ధంగా ఉన్న ప్రజాస్వామ్య రాజ్యాలకు ఉచితంగా మరొక అయిదువందల కోట్లు – ఇది సముద్రంలో కాకిరెట్ట – ఇస్తున్నాం... మన ఉత్పత్తి సరుకు కొన నిరాకరించే దేశాల మీద యుద్ధం చెయ్యటానికి పదివేల కోట్లు ఖర్చున్నది. దీన్ని గురించి సభ్యులలో రెండభిప్రాయాలు లేవని నమ్ముతున్నాను. మిగతా చిల్లర ఖర్చుకు గాను నాలుగు వేల కోట్లు అవుతుంది. ఈ నాలుగు కోట్లలోనూ మూడు కోట్లు, లాభాలు చాలక ఉత్పత్తి నిగ్రహిస్తున్న పారిశ్రామికులకు లంచంగా ఇవ్వవలసి ఉంది.

ఇంకా పత్రికలో బడ్జెటు చర్య కూడా ఉంది. కొందరు సభ్యులు, బడ్జెటు నిర్దుష్టంగా లేనప్పటికీ, లాభాలను దొందపోటు పొడుస్తున్నప్పటికీ, పారిశ్రామికులు దేశ క్షేమం కోసం కొంత త్యాగం చేసి ఈ బడ్జెట్టును సమర్థించాలన్నారు.

నా పక్కనున్న పెద్దమనిషి ఇంకా చదువుకుపోతున్నాడు. నాకు విసుగెత్తింది. నాకసలే రాజకీయాలంటే మంట. కొందరికి ప్రపంచంలో ఏం జరిగినా అంతా కావాలి. నా కది గిట్టదు. ఎవరిపని వాళ్లు చూసుకుంటే చాలు. రాజ్యాలు ఏలేవాళ్లు ఏలుతారు. మిగతా వాళ్లకెందుకు హడావుడి? నన్నడిగితే వార్తా పత్రికలే ఉండరాదు. వాటి మూలంగానే సహం ఆందోళన.

నాకూ పత్రిక చదివే పెద్ద మనిషికే మధ్యలో ఒక మాసపత్రిక కనపడింది. దాని పేజీలు తిరగ వెయ్యసాగాను. “సంఘం దేనికి?” అనే ఒక వ్యాసం కనపడింది. అది రాసినవాడు జ్ఞన్నుతృయ్య ఎం.బి.పి.డి.ఎచ్.ఎక్స్.డి.వై.త్రీ.పీం.హం.(బాగ్) గారు.

ఆ వ్యాసంలో మృత్రయ్యగాను సంఘమనేది ఒక మూఢ విశ్వాసమని యుక్తియుక్తంగా వాదించాడు. ఏమిటీ సంఘం? దీనివల్ల మనకు కలిగిన లాభమేమిటి? ప్రకృతిలో వ్యక్తులకే ప్రాధాన్యం ఇచ్చి, పరిణామమంతా వ్యక్తుల ద్వారానే జరిగింది. సంఘం వచ్చి వ్యక్తిని చంపేసింది. మన జ్ఞానులు వ్యక్తికే ప్రాముఖ్యం ఇచ్చారు. ఎవడి మోక్షం వాడు చూసుకోవాలనుకున్నారు. మనుషులు పుట్టింది లగాయతు అపూర్వ

వ్యక్తులనిపించుకున్న వారంతా వ్యక్తులే – అంటే సంఘానికి ఎడంగా నిలబడ్డవారే. వారిని సంఘం హతమార్చింది. ఒక అపూర్వ వ్యక్తి కోసం అనామకులు నశించుటమనేది ఉత్పత్తి క్రమంలోనే ఉంది. సంఘమను ప్రతిబంధకం లేనట్టయితే మానవజాతిలో ప్రతివాడూ ఒక అలెగ్జాండరు, ఒక నెపోలియను, ఒక హిట్లరు, ఒకనిచే అయి ఉండేవాళ్లు. సంఘం మానవ పరిశ్రమను అరికట్టింది ఒక నీతి చట్టమూ, న్యాయ చట్టమూ, నిరబంధాలూ, డిప్రెషనులూ, మానసిక వ్యాధులూ చెలరేగాయి. సంఘ సమస్యలు పరిష్కారం అవుతున్నకొద్దీ పెరిగాయి. న్యాయస్థానాలనూ, నియమాలనూ ప్రకృతి అసహ్యించుకుంటుంది. ప్రతిక్రియకూ సృష్టిలో ప్రతిక్రియ ఉంటూ ఉంది. న్యాయచిట్టాలు ప్రకృతికే విధంగా సహకరించాయి? ఒకణ్ని మరొకరు చంపితే చంపబడ్డవాడు చచ్చినవాడయినాడు. చంపినవాణ్ని సమాజం ఉరి తీయటం వల్ల అధికంగా అయినదేమిటి? ఈ దిక్కుమాలిన సంఘం కోసం మతాలూ, యంత్రాలూ, ఉత్పత్తీ, సమ్మెలూ, ఉద్యమాలూ, జైళ్లూ, కాల్పులూ, యుద్ధాలూ – ఇవన్నీ అవసరమయాయి. ఇంతా చేసి సంఘం వీటిని ఉపయోగిస్తున్నదా? లేదు. ఇవే సంఘాన్ని ఉపయోగిస్తున్నాయి. సంఘం అనేది పోవాలన్నాడు మ్నుత్రయ్య.

"కళల విషయంలో చూసినట్టయితే సంఘం కళలకు ఎంత అపకారం చేసిందీ స్పష్టంగా తెలిసిపోతుంది. కేవలమూ సంఘ సేవకోసమే ఉద్దేశించిన కళలు చాలా చచ్చుగా ఉంటూ వచ్చినై. వ్యక్తిత్వం కూడుకున్న కళలే అత్యద్భుతంగా ఉన్నాయి. ఈ విషయం అనేక దశాబ్దాలుగా విమర్శకులు గ్రహించినప్పటికీ దాని అంతరార్థం గ్రహించ లేకపోయినారు" అని కూడా రాశాను.

నేనీ వ్యాసం చదవటం పూర్తి చేసే సమయానికల్లా ఆ పెద్దమనిషి పత్రిక మడిచి పక్కన పెట్టాడు.

"ఆ కనిపించేదేమిటి?" అన్నాను.

"అవా? అవి జైళ్లు."

"అంత పెద్దవా?" అన్నాను.

"ఏం? అందులో ఇరవై వేల మంది ఉన్నారు."

"కొద్దిసేపటి కింద ఇటువంటి ఇళ్లే చూశాను."

"అవును. ఈ ప్రాంతాల అయిదారు మైళ్లకొక జైలున్నది."

"ఇది జైలని నేను నమ్మలేకుండా ఉన్నా. ఆ గొట్టాలూ అవి ఏమిటి?"

"అవి ఫ్యాక్టరీలు. జైళ్లున్నచోట ఫ్యాక్టరీలుండవా?"

ఉంటాయని నాకు తెలీదు. కాని ఆయన అన్న తరువాత నాకూ తెలిసినట్టే అనిపించింది.

"ఇప్పుడు పరిశ్రమయావత్తు ఖైదీల శ్రమతోనే నడుస్తున్నది."

"అట్లా ఏం?"

"ఒక చిక్కు వచ్చింది. మామూలుగా పెట్టుబడిదారీ వేదాంత ప్రకారం పనివాడు స్వేచ్ఛగా తన కూలి అమ్ముకుంటాడు. ఆ స్వేచ్ఛను కూలి వాళ్లు దుర్వినియోగపరచి కూలికి రావడం మానేశారు. కూలికి రానివాళ్లని నిర్బంధించటానికి చట్టం చెయ్యటం సాధ్యం కాకపోయింది. సమ్మెలు చేస్తే కాల్చవచ్చునని శాసనం చేసేసరికి వాళ్లు అసలు పనికే రావటం మానేశారు. కాని మరోరకం శాసనం చెయ్యటం సాధ్యమయింది. ఏ మనిషి గానీ ఏ విధంగా బతుకుతున్నాడో చెప్పలేకపోతే వాణ్ని జైల్లో వెయ్యవచ్చు. ఈ విధంగా లక్షలకు లక్షలు జైళ్లలో పడ్డారు. వారంతా దమ్మిడీ కూలీలేకుండా పరిశ్రమలు నడుపుతున్నారు. తిండి మాత్రం పెట్టి రోజుకు 12, 14 గంటలు పని చేయించటం సాధ్యమయింది. కాని కొంతమంది పెట్టుపడిదార్లు ఈ ఏర్పాటుకు గునుస్తున్నారు. వారి ఉద్దేశంలో స్వేచ్ఛగా వచ్చిన కూలీలే చౌకగా వస్తారుట. తిండికి కూడా సరిగా ఇవ్వకుండా కూలీవాళ్లని సంపాదించిన పెట్టుబడిదార్లున్నారు మరి."

ఆయన మాట్లాడుతుంటే నాకు కోపం వచ్చింది.

"నువు నన్ను మోసం చేస్తున్నావు. పెట్టుబడిదార్లను గురించి అభూత కల్పనలు చేస్తున్నావు. నువు ఇందాక పత్రికలో చదివినవన్నీ కూడా అబద్ధాలే. నేను పెట్టుబడిదార్ల నెరుగుదును. వాళ్లు నా దేశాన్ని దాస్యంలో నుంచి బయటికి తెచ్చారు. వాళ్లు దేశభక్తులు. కమ్యూనిస్టు పీడను కూడా వాళ్లే తొలగించారు. వాళ్లను గురించి నా మనస్సు విరచటానికి ప్రయత్నిస్తున్నావు. పెట్టుబడిదారీ విధానాలకే నువు ఎసరు పెడుతున్నావు. నీ నోరు మాట్లాడుతూంటే నొసలు వెక్కిరిస్తూ ఉంది. చూడు నిన్నేం చేయిస్తానో!" అన్నాను.

ఆయన నావంక అనుమానంగా చూశాడు.

"నీ ధోరణి చూస్తే నువు భూగర్భంలో నుంచి వచ్చిన కమ్యూనిస్టల్లే ఉన్నావు. నిన్ను నేను పసికట్టలేననుకున్నావా? చూడు – నిన్నేం చెయిస్తానో! పోలీసులు నా మిత్రులు" అన్నాడు.

"పోలీసులు నా మిత్రులు!" అన్నాను.

"నా మిత్రులు!" అన్నాడు.

"పెట్టుబడిదార్లు మా వాళ్లు!" అన్నాను.

"మావాళ్లు!" అన్నాడు.

"పోరా కమ్యూనిస్టు!" అన్నాను.

"పోరా కమ్యూనిస్టు!" అన్నాడు.

"దేశద్రోహీ!" అన్నాను.

"పోరా ప్రజాద్రోహీ!" అన్నాడు.

"దొంగ ముండా కొడకా దొరికావు! కమ్యూనిస్టువు కాకపోతే నీకు ప్రజలతో ఏం పని? చూడు నీ బతుకేం చేస్తాను!" అని ఆయన మీదికి వురికాను.

ఆయన మాయమైనాడు. నేను కాస్తా రైల్లో నుంచి కిందికి పడటం మొదలు పెట్టాను.

❀ ❀ ❀ ❀ ❀

ఉలిక్కిపడి పక్కలో లేచి కూర్చున్నాను.

ఏం కల ఇది? దిక్కుమాలిన కల!

కాని ఇది నిజం కాదు, నాకు తెలుసు. నా కల లేవీ నిజం కావు. నా మిత్రులంతా నా శ్రేయస్సుకోరి నన్ను కలలు కనవద్దనీ, ఎక్కడన్నా ఒక నౌకరీ సంపాదించుమని బుద్ధికలిగి బతకమనీ సలహా ఇస్తూనే ఉన్నారు. నాకే ఓపిక లేకుండా ఉంది.

***ముద్రణ : దేశీ, డిసెంబర్, 1955***